## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 05-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపటి నుండి ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలలో పర్యటించనున్నారు.
- 'వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ)'- (VB-G RAM G) చట్టం-2025 క్రింద తొలి విడతగా రాష్ట్రాలకు 25వేల కోట్ల రూపాయల నిధులను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ విడుదల చేశారు.
- మహిళల టీ20 క్రికెట్ ప్రపంచకప్ లో భాగంగా లండన్ లోని లార్డ్స్ మైదానం వేదికగా ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతోంది.
- వాయుగుండం ప్రభావంతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మధ్య మహారాష్ట్ర, కొంకణ్, గోవాలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపటి నుంచి మూడు దేశాల పర్యటనకు వెళ్లనున్నారు. ఆరు రోజుల పాటు ఆయన ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలలో పర్యటించనున్నారు. ఈ నెల 8వ తేదీ వరకు ఇండోనేషియాలో పర్యటించనున్న ప్రధానమంత్రి ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. అనంతరం 8 నుంచి 10వ తేదీ వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి 3వ 'భారత్-ఆస్ట్రేలియా వార్షిక శిఖరాగ్ర సదస్సు'లో పాల్గొంటారు. 10, 11 తేదీల్లో న్యూజిలాండ్‌లో పర్యటించనున్న ప్రధానమంత్రి ఆ దేశ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో కీలక చర్చలు జరుపుతారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇండోనేషియా పర్యటనతో రెండు దేశాల మధ్య ఉన్న సంబంధాలు మరింత బలపడటమే కాకుండా సరికొత్త రంగాలలో సహకారం ఏర్పడ నున్నదని ఇండోనేషియాలో భారత రాయబారి సందీప్ చక్రవర్తి తెలిపారు. జకార్తాలో ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ, ఈనెల 6 నుండి 8వ తేదీ వరకు జరిగే ప్రధానమంత్రి పర్యటనలో భారత్-ఇండోనేషియా మధ్య ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలు మరింతగా విస్తరించనున్నాయని అన్నారు. భారత్ నిర్దేశించుకున్న 'వికసిత్ భారత్', ఇండోనేషియా లక్ష్యమైన 'గోల్డెన్ ఇండోనేషియా' సాధన దిశగా ఇరు దేశాలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాలని చూస్తున్నాయని సందీప్ చక్రవర్తి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ఉపాధి కల్పనే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ)' - (VB-G RAM G) చట్టం-2025 ఈనెల 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రావడం పట్ల కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సంతోషం వ్యక్తం చేశారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులతో ఆయన ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ

పథకం అమలుతీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రాలకు తొలి విడతగా 25 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులను మంత్రి విడుదల చేశారు. సమీక్షా సమావేశంలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించిన 15 రోజుల్లోనే వేతనాలు చెల్లించేందుకు వీలుగా, రాష్ట్రాల వద్ద తగినంత నిధులు ఉండేలా చూసేందుకే ఈ 25 వేల కోట్ల రూపాయల నిధులను విడుదల చేసినట్లు స్పష్టం చేశారు. 'వికసిత్ భారత్' స్వప్నాన్ని సాకారం చేసేందుకు రాబోయే ఐదేళ్లలో దేశంలోని 2 లక్షల 86 వేల పంచాయతీలకు ఈ చట్టం కింద ఏడున్నర లక్షల కోట్ల రూపాయలకు పైగా నిధులను అందిస్తామన్నారు. కొత్త చట్టం ప్రకారం కూలీల రోజువారీ వేతన రేట్లను సగటున 10 శాతం మేర పెంచినట్లు కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్…24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ ఆసియా ఘర్షణలో కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో.. సహజ వాయువు సరఫరాపై విధించిన నియంత్రణలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. 'హార్ముజ్ జలసంధి' ద్వారా ద్రవీకృత సహజ వాయువు (LNG) రవాణా నౌకల రాకపోకలు మళ్లీ యథావిధిగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సరఫరాపై గతంలో విధించిన ఆంక్షలను ఉపసంహరిస్తున్నట్లు కేంద్ర చమురు, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = =

విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ నేడు దోహాలో ఖతార్ ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి మహ్మద్ బిన్ అబ్దుల్ రెహమాన్ బిన్ జాసిమ్ అల్ థానీతో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారానికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలలో ఖతార్‌లో నివసిస్తున్న భారతీయ సమాజం భద్రత, సంక్షేమాన్ని పర్యవేక్షిస్తూ, వారి శ్రేయస్సుకు భరోసా కల్పిస్తున్నందుకు ఖతార్ ప్రధానమంత్రికి జైశంకర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ ఈరోజు చంపావత్ జిల్లా తానక్‌పూర్ నుంచి కైలాస్ మానసరోవర్ యాత్ర-2026 తొలి బృందాన్ని జెండా ఊపి ప్రారంభించారు. బృందంలో 49 మంది యాత్రికులు ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కైలాస మానససరోవర యాత్ర కేవలం ఒక మతపరమైన ప్రయాణం మాత్రమే కాదని, అది దేశ ఆధ్యాత్మిక చైతన్యానికి, సాంస్కృతిక ఐక్యతకు, జాతీయ సమగ్రతకు ప్రతీక అని తెలిపారు. యాత్రకు వెళ్లే భక్తులంతా స్థానిక హస్తకళలు, కుటీర పరిశ్రమల ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా అక్కడి ప్రజలను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర యువజన, క్రీడా వ్యవహారాల శాఖా మంత్రి డా. మాన్సుఖ్ మాండవియా ఢిల్లీలో ఈరోజు జరిగిన ''ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్'' 80వ విడత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సైక్లింగ్ చేయడం వల్ల శరీరం ఎంతో ఆరోగ్యంగా వుంటుందని, నగరాల్లో పెరిగిపోతున్న కాలుష్యానికి, సైక్లింగ్ ఒక్కటే పరిష్కారమని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం ఒక్క గంటైనా మొబైల్ స్క్రీన్లకు దూరంగా ఉండాలని, ఆ సమయాన్ని వ్యాయామం, ఆటలకు కేటాయించాలని కోరారు. అప్పుడే ఫిట్ ఇండియా సాధ్యమవుతుందని మంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారత్ నుంచి 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను దిగుమతి చేసుకునే ప్రతిపాదనను భూటాన్ తిరస్కరించిందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను చమురు, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. చమురు మార్కెటింగ్ కంపెనీలు భూటాన్‌కు అలాంటి ప్రతిపాదన ఏదీ చేయలేదని కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతానికి భూటాన్‌కు ఇ-20 పెట్రోల్‌ను ఎగుమతి చేసే ఆలోచన గానీ, ప్రతిపాదన గానీ ప్రభుత్వం వద్ద లేదని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ సామాజిక మాధ్యమ వేదిక 'ఇన్‌స్టాగ్రామ్'లో వస్తున్న కొన్ని చెల్లింపు ప్రకటనల్లో చిన్నారుల లైంగిక వేధింపులు, అశ్లీలతను ప్రోత్సహించేలా ఉన్న కంటెంట్‌పై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం 'మెటా' కు నోటీసులు జారీ చేసింది. చిన్నారుల అశ్లీలతను ప్రోత్సహించేలా ఉన్న అన్ని రకాల ప్రకటనలను, కంటెంట్‌ను తక్షణమే నిలిపివేయాలని, ఈ వ్యవహారంపై వారం రోజుల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని మెటా సంస్థను ఆదేశించింది.

= = = = = = = = = = = = = = = = = = =

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారిందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. ఇది బాలాసోర్‌కు ఆగ్నేయంగా 50 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని, రాగల 24 గంటల్లో తీరాన్ని దాటే అవకాశం ఉందని తెలిపింది. వాయుగుండం ప్రభావంతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మధ్య మహారాష్ట్ర, కొంకణ్, గోవాలో భారీ వర్షాలు కురిసే ప్రమాదం వుండడంతో IMD 'రెడ్ అలర్ట్' ప్రకటించింది. రాబోయే రెండు రోజుల్లో కోస్తాంధ్రాతో సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రాగల ఐదు రోజుల పాటు బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున, మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లరాదని సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = =

మహిళల టీ20 క్రికెట్ ప్రపంచకప్ లో భాగంగా లండన్ లోని లార్డ్స్ మైదానం వేదికగా ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్ జట్టు 5 ఓవర్లు పూర్తయ్యేసరికి 2 వికెట్లు కోల్పోయి 33 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

మాదకద్రవ్యాల ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భారత్ నేతృత్వంలో అస్సాంలోని గువాహటి వేదికగా రేపటి నుంచి రెండు రోజుల పాటు 'బ్రిక్స్ (BRICS) దేశాల యాంటీ-డ్రగ్ ఏజెన్సీ అధిపతుల సమావేశం' జరగనుంది. సభ్య దేశాల మధ్య నిఘా వర్గాల సమాచార మార్పిడిని వేగవంతం చేయడం, సంస్థాగత సహకారాన్ని పెంపొందించుకోవడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది.
అలాగే.. బ్రిక్స్ అధ్యక్ష హోదాలో (ఛైర్‌షిప్) భారత్ ఆధ్వర్యంలో కేరళలోని కొచ్చి నగరంలో రేపటి నుంచి రెండు రోజుల పాటు 'బ్రిక్స్ మహిళా వర్కింగ్ గ్రూప్ సమావేశాలు' జరగనున్నాయి. బ్రిక్స్ సభ్య దేశాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొనే ఈ సదస్సులో మహిళా సాధికారత, మహిళల నేతృత్వంలోని అభివృద్ధి తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = =

చత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రముఖ 'పాండవాణి' గాయని, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత తీజన్‌బాయి ఈరోజు కన్నుమూశారు. తీజన్‌బాయి మృతిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమాల వేదికగా సంతాపం తెలిపారు. ఛత్తీస్‌గఢ్ పాండవాని సంప్రదాయానికి ఆమె అందించిన గుర్తింపు చిరస్మరణీయమని, భారత సాంస్కృతిక వారసత్వాన్ని వ్యాప్తి చేయడంలో ఆమె కృషి ఎప్పటికీ నిలిచిపోతుందని రాష్ట్రపతి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =